# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**

2. **విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య, నైపుణ్య అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **రైతులకు ఆర్థిక సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని తెలంగాణ నీటిపారుదశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.**

5. **అల్పపీడన ప్రభావంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లో రానున్న 24 గంటల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==============================

రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నిన్న జైపూర్‌లోని గాంధీనగర్ రైల్వే స్టేషన్‌లో కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రైళ్లు పట్టాలు తప్పేలా ఇటీవల కొన్ని ఘటనలు వెలుగుచూశాయని, ఇటువంటి వాటిపై రైల్వేశాఖ అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. ఈ తరహా ఘటనలను నిర్మూలించేందుకు రాష్ట్రాల యంత్రాంగాలు, పోలీసులతో చర్చలు జరుపుతున్నామని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్య, నైపుణ్య అవకాశాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఉన్నత విద్యపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల ఖాళీల భర్తీకి కొత్తగా ప్రకటనలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో

విద్యా ప్రమాణాలు పెంచి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్‌లు సాధించేలా ప్రణాళికలు ఉండాలని అన్నారు.

---------------------------

రైతులకు ఆర్థిక సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న “పొలం పిలుస్తుంది” కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు సాగు వ్యయాన్ని తగ్గించడం, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, మెరుగైన సాగు పద్ధతులు అవలంబించడం వంటి అంశాలతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

వ్యాపారాల్లో అవకాశాలు, సవాళ్లు, వినూత్న మౌలిక సదుపాయాలకు నిధులు, ప్రత్యామ్నాయ మార్గాలు తదితర అంశాలపై చర్చించేందుకు భారత పరిశ్రమల సమాఖ్య –సీఐఐ ఆధ్వర్యంలో ఈరోజు విశాఖపట్నంలో ‘మౌలిక సదుపాయాల సదస్సు’ జరగనుంది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొంటారు. పలు ఐటీ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై, విశాఖలో ఐటీ రంగం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

---------------------------

నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనులను వేగవంతం చేయాలని తెలంగాణ నీటిపారుదశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాలువకు పడిన. గండి పూడ్చివేత పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, గండి పూడ్చివేత పనుల్లో జాపం జరుగుతున్న వీలైనంత త్వరగా పూడ్చి వేత పనులను చేపట్టాలని సూచించారు. వరద ఉధృతికి తట్టుకునే విధంగా నాణ్యతగా నిర్మాణ పనులను చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలో మరో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, మిగిలినచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు కురుస్తాయని అమరావతి వాతావరణ వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని ఏడు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కాగా.. హైదరాబాద్‌లోని పలుచోట్ల నిన్న రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలనకు గత 100 రోజుల్లో తీసుకున్న నిర్ణయాలే నిదర్శనమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. నిన్న హైదరాబాద్లో కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వంద రోజులు పాలన సాగిందన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం తొలి వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల్లో వికసిత్ భారత్ దిశగా మోదీ 3.0 పాలన సాగింది. ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావం చూపే విధంగా, తద్వారా వికసిత్ భారత్ 2047 కోసం బలమైన పునాది వేస్తూ, మొదటి 100 రోజుల్లో ప్రధానమంత్రి అనేక ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం వంద రోజుల పాలనపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 26న జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశిస్తూ, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంలో పొగాకు పొట్లం ఉన్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంలో పొగాకు పొట్లం ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపింది. తిరుమలలోని లడ్డూ పోటులో అత్యంత భక్తి శ్రద్ధలతో, నియమ నిష్ఠలతో రోజూ లక్షలాదిగా లడ్డూలను తయారు చేస్తారని, ఈ తయారీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని వివరించింది.

---------------------------

సేవ చేయాలనే లక్షణం విద్యార్థులు సమాజాన్ని అర్థం చేసుకునేందుకు దోహదపడుతుందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, గుంటూరు క్షేత్ర ప్రచార అధికారి ఆర్. రమేశ్ చంద్ర అన్నారు. ఎన్. ఎస్. ఎస్. 55వ వార్షికోత్సవం సందర్భంగా నిన్న గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలలో జాతీయ సేవా పథకం వాలంటీర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు సమాజం గురించి సొంత దృక్పథాన్ని ఏర్పర్చుకోవడంతోపాటు, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.

---------------------------

దేశంలో పేదలను సముద్ధరించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈరోజు అంత్యోదయ దివస్ నిర్వహిస్తున్నారు. అంత్యోదయ అంటే పేదలలోని పేదలను ఉద్ధరించడం. ఈ రోజు సమాజంలోని బలహీన వర్గాలను చేరుకుని, వారి సంక్షేమం కాంక్షించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. భారత దేశంలో

ప్రభావవంతమైన నాయకులలో ఒకరు, జన సంఘ్ వ్యవస్థాపకులు అయిన పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని అంత్యోదయ దివస్‌గా నిర్వహిస్తున్నారు. పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫరే పట్టణానికి సమీపంలోని చంద్రభాన్ గ్రామంలో 1916వ సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన జన్మించారు. సమాజంలో పేదల అభ్యున్నతి కోసం ఆయన ఆవిరళ కృషి చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రహదారులను 297 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో 35.10 లక్షల రూపాయలతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు.

======================